# ఎల్లోరాలో వాళ్లు ముగ్గురు

ఎల్లోరా...

కైలాస్ టెంపుల్ వరకు పోతుంది ఔరంగాబాద్ నుండి వచ్చే ఒక రోడ్డు. ఉత్తర దక్షిణలుగా సాగిన దాదాపు పదిఫర్లాంగుల పొడవున వ్యాపించిన కొండ వాలులో మానవ నిర్మితమైన గుహలు. అవి మామూలు గుహలు కావు. అపార శిల్పవైభవంతో అలంకరించిన విశాలమైన గుహలు. మొత్తం ముప్పయి నాలుగు గుహల్లో దక్షిణాన ఉన్న పన్నెండు —— బౌద్ధగుహలు. చైత్యాలు, స్థూపాలు, చైత్య స్థూపాలు, ఆరామాలు, విహారాలు, బోధిసత్త్వుని కళాత్మక శిల్పాలు.

బుద్ధం శరణం గచ్ఛామి

ధర్మం శరణం గచ్ఛామి

సంఘం శరణం గచ్ఛామి...

మార్మ్రోగుతున్న ప్రాకృతిక నిశ్శబ్ద సంగీతం అక్కడ...

వాళ్ల బస్సు తిన్నగా కైలాస్ టెంపుల్ సమీపంలో గెస్ట్‌హౌస్ దగ్గర్లో రోడ్డు ప్రక్కనే ఉన్న ఒక హోటల్ దగ్గర ఆగింది.

అప్పటికే అక్కడ ఏడెనిమిది టూరిష్ట్ బస్సులు రోడ్డుకు రెండువేపులా ఉన్నాయి. వాటిల్లో కొన్ని విదేశీపర్యాటకబృందాల వారి బస్సులు. యూరోపియన్లు. జపాన్ దేశస్థులు. వాళ్లు చైనా, కొరియా దేశస్థులు కూడా కావచ్చు. మంగోలియన్ రూపు రేఖలు. ఆడా మగా. చాలా పెద్ద వయస్సు వాళ్లూ ఉన్నారు. చిన్న వయస్సు వాళ్లూ ఉన్నారు. పదిపన్నెండేళ్ల పిల్లలూ ఉన్నారు.

కెమేరాలతో... బైనాక్యులర్స్‌తో...

అక్కడ ఆగింది హైదరాబాద్‌నుండి హైస్కూల్ విద్యార్థులతో, ఉపాధ్యాయులతో, వాళ్ల కుటుంబాలతో, మిత్రులతో వచ్చిన టూరిష్ట్ బస్సు.

అక్కడున్న బస్సులలో ఈ టూరిష్ట్ బస్సు పేదగా ఉంది.

బిలబిలా దిగారు విద్యార్థులు.

ఎక్కడకు పోతున్నదీ చెప్పా చెయ్యక బస్‌నించి దిగీదిగడంతో అడవిచెట్ల మధ్యనుండి పరుగులంకించుకున్నాడు పాల్. అసలే పొడవరి. మధ్య మధ్య జొన్నచేల పొలాలు. ఆ జొన్నచేలల్లోంచి ఆయన పరుగు.

చలిగాలులు సూదుల్లా పొడుస్తున్నాయి. ఆ చలిని కూడా లెక్క చేయకుండా, తన మిత్రులు రాజు, శంకరం వస్తున్నారా లేదా అని వెనక్కి చూడకుండా పరుగు తీసిన పాల్‌ని చూస్తూ నుంచున్నారు బస్సునుండి దిగిన ఉపాధ్యాయులు.

రాజు దృష్టి అక్కడకు వచ్చిన ఆ విదేశీపర్యాటకుల ఆకర్షణలో చిక్కుకుంది. మరీ ముఖ్యంగా ---- వాళ్లు జపాన్ దేశస్థులో ఏమో —— ముగ్గురు అమ్మాయిల మీద దృష్టి ఆగిపోయింది.

రాజు తువ్వాల్ని మఫ్లర్‌లా మడచి తలకు చుట్టుకుని పళ్లు బిగించి ముడుచుకుపోతూ, పాల్ పరుగుతీసిన జొన్నచేల పొలాలవేపు చూస్తూ నుంచున్నాడు.

శంకరం ఈ యాత్ర నిర్వాహకులతో మాట్లాడుతున్నాడు. ఓ గంటలో టిఫిన్ సిద్ధమవుతుందని, టిఫిన్ తినేలోపు ఎక్కడికీ వెళ్లవద్దని విద్యార్థులనీ, ఉపాధ్యాయుల్నీ, ఉపాధ్యాయుల కుటుంబసభ్యులనీ, వాళ్ల వాళ్ల స్నేహితుల్నీ ఈ విహారయాత్ర నిర్వాహకుడు ఆదేశించాడు. టిఫిన్, భోజనం వేళల్లో అందరితోపాటు ఉండి సహకరించమని ఇదివరకే ఆయన హెచ్చరించాడు. ఇప్పుడు మరొకసారి అందరికీ గుర్తుచేస్తున్నాడు. పాఠశాల ఉపాధ్యాయుడుగా శంకరంకి, పాల్‌లాగ పరుగులుతీసి పారిపోయే స్వేచ్ఛలేదు.

అయితే పాల్ గాని, రాజుగాని తిండికోసం లెక్కచేసేట్టులేరు. వాళ్లకు ఈ ఎల్లోరా అజంతా యాత్ర కళా ప్రపంచంలో విహారం.

శంకరం భుజాన ఎయిర్‌బేగ్.

చుట్టూ కనుచూపు మేర ప్రకృతి అందాలని చూస్తూ మౌనంగా కొద్దిసేపు గడిపాడు శంకరం. తన కళ్లముందు రంగురంగుల ఉషోదయ శోభ మనోహరంగా ఉంది.

రోడ్డుకు అటువేపు ఓ చెట్టుకింద కూర్చున్నాడు రాజు. తన స్కెచ్ బుక్‌తో. ప్రకృతి సుందర దృశ్యాలు అతడి రేఖాచిత్రాల్లో ఒదిగిపోతున్నాయి.

పొగమంచు...

ఇంకా సూర్యోదయం కాలేదు. తెలిమబ్బులు నిండిన తూర్పు.

పాల్ చెట్లల్లో చేలల్లో మాయమైనాడు.

వేపచెట్టు కింద తుప్పచాటులో కూర్చున్న రాజు ప్రకృతి రమణీయతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నట్టున్నాడు.

ముగ్గురు అమ్మాయిలు —— జపనీస్ దుస్తుల్లో —— ఇరవై పాతికేళ్ల వయస్సులో —— వేపచెట్టు వేపు వచ్చారు. ఇద్దరు అమ్మాయిలు తమ బైనాక్యులర్స్‌తో ఎల్లోరా కొండలని చూస్తున్నారు. వాళ్లల్లో ఒక అమ్మాయి తన కెమెరాతో ఫోటోలు తీస్తున్నది. చిత్రకారుడు రాజు దృష్టిలో పడకుండా అతడిఫోటోను కూడా తీసింది.

అంతలో ఇద్దరు యూరోపియన్ పర్యాటకులు రోడ్డు దిగి పొలాల్లోకి పోతున్నారు. వాళ్ల వీపున బేగ్స్ ఉన్నాయి. బైనాక్యులర్స్, కెమేరాలు కూడా వేలాడుతున్నాయి మెడల్లో.

రాజుకు పాదాల దగ్గరే ఒక అందమైన నునుపుదేరిన దోసకాయంత రంగురంగుల రాయి దొరికింది. దాన్ని చేతుల్లో పట్టుకుని చూస్తూ మురిసిపోతున్నాడు.

శంకరం దగ్గరకు రావటం చూసి 'చూడండి ఎంత అందంగా ఉందో ఈ రాయి' అన్నాడు.

అవును ఆ రాయి రంగుల ముద్దలా ఉంది. అది రాయి అంటే నమ్మేట్టు లేదు. పగడం లాంటి రంగు. తన చేతిలోకి తీసుకుని చూశాడు శంకరం. చాల బరువుగా ఉంది. మామూలు రాయికన్నా బరువుగా ఉన్నట్టు అన్పించింది.

వాళ్లు ముగ్గురూ —— ఒకడు గంధర్వ గాయకుడు. ఒకడు చిత్రకారుడు. మూడో వాడు కథారచయిత. వారి వారి రంగాల్లో కఠినసాధన చేస్తున్నవాళ్లు. బతుకు తెరువుకోసం ఇప్పుడు ఉద్యోగాలు చేస్తున్నవాళ్లు.

ఇప్పుడు వాళ్లు వచ్చింది ఎల్లోరాని చూట్టానికి కాదు. అక్కడ కళాదేవతను ఆరాధించటానికి. హృదయాంజలి గానం చేయటానికి. ఆ కళాదేవత చరణారవిందాల సన్నిధి మౌనముద్రాంకితమైన మనస్సులతో స్ఫూర్తిని పొందటానికి.

అదుగో ఆ ముందే కైలాసా టెంపుల్... పదహారో గుహ. అది ప్రపంచ అద్భుతాలలో ఒకటని రాత్రి తెలుగు పండితులు శాస్త్రిగారు చెప్పారు. ఇదివరలో మూడుసార్లు ఎల్లోరా అజంతాలు చూశారంటాయన. ఆ అందాలు, ఆ మహాశిల్పాల శతాబ్దాల నిర్మాణ కౌశల్య ప్రతిభ...

పదమూడో గుహనుండి మొదలుకుని పదహారు గుహలు శైవ గుహలు. బౌద్ధం అంతరించిన అనంతరం శైవం ఆనాటి చక్రవర్తుల పోషణలో ఈ గుహలు, శైవ

గాథలతో విలసిల్లాయి. ఆ గుహల్లోనే ఉంది పదహారో గుహ. కైలాస్ ఏకశిలామహామందిరం.

ముందు కైలాస్ టెంపుల్‌కి పోవాలని ఉంది శంకరంకి. అక్కడ ఒంటరిగా తిరగాలని ఉంది. పిల్లలతో ఉండాలని ఉంది. పైగా శంకరం చరిత్ర బోధించే ఉపాధ్యాయుడు. అయితే ఈ యాత్రలో వచ్చిన సరస్వతమ్మ కూడా చరిత్ర బోధించే ఉపాధ్యాయురాలే. తన కన్న సీనియర్. పెద్ద క్లాసులుకు ఆమె టీచర్. అందువల్ల పిల్లలని ఆమెకే విడిచి పెట్టాలనుకున్నాడు. ఆడపిల్లల్లేరు. అంతా మగపిల్లలే. ముప్ఫయి మంది మాత్రమే. టీచర్లు పన్నెండుగురు. ఇంకో పదిమంది వరకు బైటవాళ్లు. టీచర్ల కుటుంబాలవాళ్లు.

వచ్చిన అందరి ముఖాల్లోనూ ఎంతో సంతోషం... బడిలో రోజూ కన్పించే పాతముఖాలేవీ కన్పించటం లేదు. పిల్లలయితే లేళ్లలా చెంగుచెంగున ఎగిరి గంతులేస్తున్నారు. వాళ్లను హెడ్మాష్టర్ రెడ్డి గొర్రెల్లా —— ఈ యాత్రాకాలంలో కాపలా కాస్తున్నాడు.

పిల్లలకు సరస్వతమ్మ అర్ధగంటసేపు స్వేచ్ఛ ఇచ్చి —— కాలకృత్యాలు, ముఖాలు కడుక్కోవటం వంటివి ముగించి రమ్మన్నారు. వాళ్లకి కాపలాగా ఉండమని పెద్ద పిల్లలకి బాధ్యత అప్పగించారామె.

యాత్రలో ముగ్గురు ఉపాధ్యాయులు వంటపర్యవేక్షణలో మునిగిపోయారు. రోడ్డు ప్రక్కనే వంట ఏర్పాట్లు.

రాజు దగ్గర్నించి శంకరం మరోసారి బస్సు దగ్గరకు వచ్చాడు.

ఇద్దరు జాపనీస్ పర్యాటకులు —— విద్యార్థుల ఫోటోలు తీస్తున్నారు. వాళ్లు చిరునవ్వు ముఖాలతో పిల్లల్ని పలకరించి వాళ్లతో మాట్లాడాలని ప్రయత్నిస్తున్నారు. వాళ్లల్లో ఏ కొత్తతనమూ కన్పించదు. ఆ విద్యార్థులతో కలిసిపోయారు.

బుచ్చిబాబు గారి 'ఎల్లోరాలో ఏకాంత సేవ' కథ గుర్తొచ్చింది. అట్లాంటి కథ రాయాలని కూడా ఉంది కథా రచయిత శంకరంకి. ప్రేమ కథ రాయాలని ఉంది. ఏమో జీవితంలో కొన్ని అద్భుతాలు జరుగుతాయి. తన జీవితంలోకి ఎవరన్నా ప్రవేశిస్తారా... ఈ ఎల్లోరాలో?

శంకరం ఇప్పుడు సౌందర్యాన్వేషణలో ఉన్నాడు. తన కథాసాహిత్యం అంతా స్వప్న జగత్తే. ప్రేమికుల ప్రపంచమే. ప్రేమ లేఖలే. మహాసౌందర్యం యువతుల్లో, వాళ్ల చూపుల్లో, వాళ్ల మాటల్లో, వాళ్ల కదలికల్లో, వాళ్ల విలాసాల్లో, అప్పుడే వికసించిన పూలల్లా పరిమళిస్తూ ఉంటుంది. మనస్సూ హృదయమూ ఏకమై పరవసానందంతో నిండిపోతాయి.

ఆ గాయకుడూ, ఆ కళాకారుడు, ఈ రచయితా ఇంకా ఉన్నతంగా ఎదగాలన్న దీక్షామగ్నులు. ఈ ప్రపంచం వాళ్ళకి శతసహస్రకోటి అందాల కళా స్వప్నం.

ఆ ఉదయం అక్కడ ప్రకృతి అంతటా వేదగానం వినిపిస్తున్నట్టుంది.

శంకరం లేచి రాజు వద్దకు వెళ్లి అతడు పొగడుతున్న ఎర్ర దానిమ్మ పండులాంటి రాయిని చూశాడు. అది మామూలు రాయిలా కన్పించలేదు. రంగురంగుల రాయి. వజ్ర వైడూర్య మణిమాణిక్యాల జాతికి చెందిన రాయేమో. ఆ రాయిలో రంగులసమ్మేళన సృష్టికే చేతనౌను. ప్రకృతి యుగాలుగా తీర్చిదిద్దిన కళాఖండం అది. చూస్తున్న కొద్దీ మరింత సుందరంగా కన్పిస్తున్నది. ఆ రాయి మీది రేఖల్లో రంగుల్లో భాష ఉంది. కవిత్వం ఉంది. సంగీతం ఉంది. సృష్టి హృదయం ఉంది. వెలుగు నీడల సోయగం ఉంది. వర్షపు కన్నీటి చారలున్నాయి. కాంతి స్పర్శలున్నాయి. వర్ణచుంబనలున్నాయి. రాజుకు అవన్నీ ఆ రాయిలో కన్పిస్తున్నాయి.

అక్కణ్నించి చూస్తే కొండల్లో ఎల్లోరా గుహలు కన్పిస్తున్నాయి. ఉత్తరంగా ఉన్న ఒకే ఒక్క కొండ తప్పిస్తే మిగిలినవన్నీ జేగురురంగు చిన్నచిన్న గుట్టలు.

జొన్నచేల పొలాల మధ్యగా పదిపదిహేనడుగులు లోతుగా చలికి వణుకుతూ పారుతున్న వాగు, ఆ ఎల్లోరా గుహలలోని శిల్పసుందరులు జలకాలాడిన సరస్సులనించి పాయగా వచ్చినట్టు కన్పిస్తున్నది.

రాజు వాగు ఒడ్డున కూర్చున్నాడు. చలిగాలి తీవ్రతను అడ్డుతున్నది ఓ ముళ్లతుప్ప. ప్రకృతి కమనీయ దృశ్యాన్ని తన స్కెచ్ బుక్‌లో చిత్రించుకుంటున్నాడు. ఆ ఒడ్డున అందంగా పరచుకున్న పూలమొక్కలు, లతా గుల్మాలు, పెద్ద పెద్ద ఆకులతో టేకుచెట్లు, సీతాఫలపు మొక్కలు, దట్టంగా ఉన్నాయి. ఆ వెనక మూడు నాలుగు మహావృక్షాలు. మరికొన్ని అందమైన ప్రవాహంలో నునుపుతేలిన పండ్లలాంటి, పువ్వుల్లాంటి రాళ్లను ఏరుకుని తన ఎయిర్‌బేగ్‌లో నింపుకుని రాజు ప్రక్కనే కూలబడ్డాడు శంకరం.

వాగు పెద్ద పెద్ద బండల్ని ఒరుసుకుని ప్రవహిస్తున్నది. ఆ నిమిషాన ఆ బండలు పొందికతో, అందంతో అవి కూడా శిల్పాల్లా కన్పిస్తున్నాయి. ప్రకృతి శిల్పి తరతరాలుగా తీర్చిదిద్దుతున్న శిల్పాలవి. ఆ చెట్లూ, ఆ మొక్కలూ, ఆ బండలూ, ఆ లతలూ, ఆ పూలూ అన్నీ తనని గుర్తుపట్టి చూస్తున్నట్టుగా ఒక అనుభూతి కలిగింది శంకరంకి. హృదయానికి మాత్రమే వినిపించే కొత్త సంగీతం ఏదో అక్కడ వాగు ప్రవాహంతో గొంతు కలిపి అల్లుకుంటున్నది. సృష్టిలోని పరిమళాలు అన్నిటికన్న గొప్పదైన ఓ దివ్య పరిమళం ఆవరించింది...

సూర్యోదయమైంది. కాంతితో కళ్లు విచ్చుకుంటున్నాయి. వాగు నీళ్లలోంచి కింద

పరచుకున్న రాళ్లను కండ్లార్పకుండా చూస్తున్నాడు శంకరం. ఎల్లోరా వాగు తన శత సహస్ర కోమల హస్తాలతో అనాదిగా సానబట్టినట్టు రంగుల ముద్దల్లాగా ఆకర్షణీయంగా ఉన్నాయి ఆ రాళ్లు.

ఆ లోయల్లోంచి, ఆ జొన్నచేల పొలాల్లోంచి, చాలా దూరం నించి పాల్ గొంతు విన్పించింది. 'రండి. రండి' అని కేకలు. అప్పటికి రాజు తన స్కెచ్ బుక్‌లో రెండు మూడు రేఖాచిత్రాలు ముగించాడు.

ఆ లోయల్లో ప్రశాంత వాతావరణంలో గొంతెత్తి పాడుకుంటున్నాడు పాల్. దాదాపు ఓ ఫర్లాంగ్ దూరాన ఉన్నాడు. అయినా ఆ పాట విన్పిస్తున్నది. ఎల్లోరా గుహల్లోని శిల్ప సుందరులు వినాలన్నట్టుగా పెద్ద గొంతుతో పాడుతున్నాడు. ఆకుపచ్చని తుప్పల మధ్య నించి, లేత గోధుమ వన్నె కంకులతో నృత్యం చేస్తున్న జొన్నచేల మధ్యనించి, తెల్లని చొక్కాతో పరుగుతీస్తూ పాడుకుంటున్నాడు పాల్.

రాజు, శంకరం కూడా పరుగు తీశారు. ఆ పరుగు చలికి విరుగుడయింది. అక్కడ ఎవరికీ నడవాలనిపించదేమో. వాళ్లు పాల్ కన్పిస్తున్న చోటుకు పరుగుతీశారు. రాజు చెప్పులు వేసుకున్నాడు. ముళ్లదారిని చూసుకుంటూ పరుగెత్తుతున్నాడు. శంకరం షూజ్‌తో ఉన్నాడు. ముళ్లను తొక్కుకుంటూ లెక్కచేయకుండా పరుగెత్తుతున్నాడు.

పాల్ పాటకు దగ్గరయ్యారు ఆ ఇద్దరూ.

'ఆ ఎత్తున కొండ పైభాగాన ఉన్నాయి చూశారూ, ఆ గుహల్లోకి సామాన్యంగా అందరూ పోలేరు. అందరితో పెట్టుకుంటే మనం ఆ గుహలను చూడలేం. త్వరగా వెళ్లి ఆ గుహలను చూసేసి వచ్చేయాలి. మిగిలిన గుహలను అందరితో కలిసి పలహారాలు అయ్యాకా చూడవచ్చు. పదండి' అన్నాడు పాల్. ఎల్లోరాగుహల చరిత్ర పాల్‌కి తెలిసినట్టుంది.

మిగిలిన గుహలు దాదాపు అన్నీ పెద్ద ఎత్తుప్రదేశాల్లో ఉండవు. ఈ రెండు గుహలు మాత్రం పైన ఉన్నాయి. ఆ కొండ ఎక్కగలమా అనిపించేట్టున్నాయి. అంత సమయం ఉందా? త్వరగా వచ్చి మిగిలిన వాళ్లతో పాటు కలిసి ఉండాలి. ఈ వినోద పర్యటన పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులతో ఏర్పాటయింది. శంకరం ఆ పాఠశాలలో ఉపాధ్యాయుడు. రాజు, పాల్ తాముకూడా వస్తామన్నారు. శంకరం స్నేహితులు వచ్చి ఇబ్బంది పెట్టారు అనిపించుకోకూడదు కాని పాల్ స్వేచ్ఛకి ఇక్కడ హద్దుల్లేకుండా పోయాయి. అందుకే అతడి హృదయం పరవశించి పాటలై ఉప్పొంగుతున్నది.

పాల్, బస్సు ప్రయాణంలో ఉన్నంతసేపు పెళ్లాన్ని కలవరించాడు. ఆమె

ముత్యాలహారాన్ని తన మెడలో వేసుకున్నాడు. ఇప్పుడు అంతా మర్చిపోయి ప్రకృతిలో లీనమైపోయాడు.

సరే. మంచి ఆలోచనే. చూడాలని పట్టుదల హెచ్చింది. సాహసానికి కొదవేమున్నది. తమ యవ్వనమే ఒక శక్తి. అనుకున్నది సాధించాలన్న సంకల్పబలం.

పైగా వాళ్ల ముగ్గురికీ కళలంటే ప్రాణం. ఆ కళాదేవత చిద్విలాసవైభవంతో ప్రేరితులై, ఆమె ఆరాధనతో జీవిస్తున్నవాళ్లు. ఎక్కడికి పోయినా వాళ్లు తమతో పాటు తమ అల్లాఉద్దీన్ అద్భుతదీపాన్ని తీసుకుపోతారు. తమ కళ తమకు ఏది కావాలన్నా, ప్రార్థించిన వెంటనే, వరాలను కురిపిస్తుంది.

అందుచేతనే వాళ్లకు ఎల్లోరా వాగులో దొరికినరాళ్లు కళాత్మకంగా కనిపించాయి. అమూల్యమైనవి అనిపించాయి.

పూర్వజన్మ వాసనలు వాళ్లను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న అవ్యక్తానుభూతి. ఎల్లోరా శిల్పసుందరులు పిలిస్తేనే ఇప్పుడు ఈ యాత్రకు వచ్చినట్టుగా ఉంది వాళ్లకి.

క్రిందనున్న గుహల సందర్శనకు సదుపాయంగా కాలిబాటలోంచి విద్యార్థులు జింకల్లా పరుగులు తీస్తూ, కేకలేస్తూ రాజు, శంకరం ఉన్నవేపే వస్తున్నారు.

ముగ్గురూ ఆ చివరిగుహల దగ్గరకు చేరుకున్నారు. అవి ముప్పయి మూడు, ముప్పయి నాలుగు సంఖ్యల గుహలు.

ఎల్లోరా అజంతా గుహలంటే పుస్తకాల్లో చదువుకున్నప్పుడు చిన్నచిన్న గదుల్లా ఉంటాయనుకున్నారు. కాని ఇవేమిటి సినిమా థియేటర్ల కన్నా విశాలంగా, ఎత్తుగా అంతస్తులతో అద్భుతంగా ఉన్నాయి! మానవ నిర్మితమైన గుహలు. శిలలను తొలిచిన విశాలమైన అంతస్థుల గుహలు.

ఆ గుహల్లోని దృశ్యాలు, శిల్పాలు, కుడ్యశిల్పాలు, ద్వారాలు, స్తంభాలు, పై కప్పులో సైతం అలంకరణలు, ఊహాతీతమైన కళా జగత్తు! ఎన్ని వేలమంది ఎన్ని వందల ఏళ్ల కళాసృష్టి ఈ ఎల్లోరా గుహాతోరణం! ఆ రెండు గుహల్లో వాళ్లు అడుగుపెట్టిన తర్వాత అక్కడనుండి కదల్లేకపోయారు... తగినంత వెలుతురు లేదు. సాయంత్రం పూట అయితే కొంత వెలుతురు లోపలపడి ఆ శిల్పాలు మరింత స్పష్టంగా కన్పించేవో ఏమో! ఎంత చూసినా తనివి తీరదు. కాళ్లు నొప్పులు పుట్టి కూర్చోవాలనిపించింది. లోపలిగాలి గబ్బిలాల వాసన. ఎప్పటికప్పుడు ఈ గుహల్లో గాలిని పరిశుభ్రపరచకూడదా? రెండు గబ్బిలాలు ఆ నిశ్శబ్దంలోంచి ఎగిరి రెక్కలాడించుకుంటూ బైటికిపోయాయి. తమ రాకతో వాటి ప్రశాంతత భంగమయినట్టుంది.

రాజు స్కెచ్‌బుక్, పెన్సిల్ తీసి బొమ్మలు గీసుకుంటున్నాడు. పాల్ గొంతు

ఆశ్చర్యానందాలతో మూగవోయింది. శంకరం ఆ శిల్పాలన్నీ ప్రాణంతో ఉన్నట్టు, తమతో మాట్లాడుతున్నట్టు ఊహించుకుంటున్నాడు.

విద్యార్థులు బిలబిలా వచ్చి అట్లాచూసి అల్లరల్లరిగా బైటకి వచ్చికేకలు వేసుకుంటూ తిరిగి వెళ్లిపోయారు.

శంకరం బైటకి వచ్చి ఆ గుహలున్న కొండల పరిసర ప్రకృతి సౌందర్యాన్ని చూస్తున్నాడు. పైకిపోయేట్టు కొండమీదికి ఉన్న మెట్ల మీంచి గుహపైకి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చేసరికి రాజు, పాల్ కనిపించలేదు. గుహల్లో లేరు. బైటికి వెళ్లిన గబ్బిలాలు తిరిగి లోపలికి వచ్చిన చప్పుడు. నిశ్శబ్దంగా ఉంది.

శంకరం బిగ్గరగా పిలిచాడు.

పలకరాయె.

బిగ్గరగా ఇంకా బిగ్గరగా పిలిచాడు.

మళ్లీ అదే మెట్లదారిలో నడక సాగించాడు. పైన కన్పిస్తున్న గుహలకు అదే దారి

కింద గుహల్లోనే ఉండిపోయారేమో అని అనుమానం. పాల్ సంగతి తెలుసు. ఆ పై గుహలు చూసి రావాలని తొందర.

అల్లంత దూరాన ఎల్లోరా పల్లె, దేవాలయ గోపురం, టూరిస్ట్ ఎర్రపెంకుల హోటల్, బస్సులూ, కార్లూ, రంగు రంగుల దుస్తుల్లో దేశదేశాల వినోద పర్యాటక బృందాలూ.

వాళ్లిద్దరు మాత్రం ఎక్కడా కన్పించలేదు. కొండను చుట్టి పైకి పోతున్న దారిలో మరికొంతసేపు పరుగూ... నడకా... మళ్లీ పిలుపు.

పలికిన రాజు గొంతు.

ఎక్కడో, ఏ దిక్కునో దగ్గర్లోనే.

భుజాన బరువుసంచి. రాళ్లమీద జారుతున్న షూజ్‌తో నడక. అలసట. నుదుట చెమట. ఒక్కడూ. కొండదారి. మధ్యలో సున్నం వెల్లవేసిన మనిషి ఎత్తున చిన్నగుడి. నలిగిన దారి అక్కడ ఆగిపోయింది. ముళ్ల తుప్పల్లోంచి నడక. శంకరం.

కేక. పిలుపు.

దూరంనించి పిలుపు.

ఆగి, విని, నడక. కళ్లతో వెతుక్కుంటూ. దారి చూసుకుంటూ.

భుజాన బరువు సంచి. దూరటానికి కంతలేదు మెడకొక డోలు చందాన.

కనిపించారు మిత్రులు. తెల్ల చొక్కా పాల్. నీలం గళ్లచొక్కా రాజు. ఓ గుట్ట పై భాగానికి చేరారు వాళ్లు. ఏభై గజాలు ఎత్తులో. అక్కడికి చేరాలంటే గుట్టను చుట్టి వెళ్లాల్సిందే.

వాళ్లు చూడాలనుకున్న గుహలున్న కొండ శిఖరం దిశగా పైకి వెళ్తున్నారు

వాళ్లకి ఏ బరువూ లేదు. చెప్పా చెయ్యక ఉరికారు. శంకరం ఈ బరువు సంచితో. తినటానికి పళ్లు, తువ్వాళ్లు, షేవింగ్ సెట్, సోప్, పౌడర్, ఇంగ్లీష్ పోయిట్రీ బౌండ్ ఎడిషన్ —— వాటికి పదిరెట్ల బరువు ఈ రంగురంగుల రాళ్లూ.

వీటన్నిటినీ ఆ బస్సులోనే తగలేస్తే బావుండేది. ఎవరు ఎత్తుకుపోతారో అన్న భయం. ఇప్పుడా, వాళ్లు పిట్టల్లా ఎగిరిపోతున్నారు. ఈ బరువుతో... ఎయిర్‌బేగ్ పట్టీ ఎక్కడ తెగిపోతుందో అన్న భయం ఓ ప్రక్క.

శంకరం వచ్చే వరకు ఆగి 'ఎక్కడ తప్పి పోయారూ? మాకా బేగ్ ఇవ్వండి.' అని తన భుజాన వేలాడుతున్న ఎయిర్‌బాగ్‌ని అందుకున్నాడు పాల్.

'ఎట్లావచ్చారు?' అని ఆశ్చర్యపోయాడు శంకరం.

ఆ ఇద్దరూ చెప్పులు చేతుల్లో పట్టుకుని నడిచినట్టున్నారు. చెప్పులు ఆ రాళ్లమీద ఎత్తు ఎక్కుతున్నప్పుడు జారిపోతున్నాయని వాటిని తీసేసి చేతుల్లో పట్టుకున్నట్టున్నారు. వాళ్ల తీరుతెన్నులు చూస్తుంటే పెద్ద సాహసమే చేసినట్టుంది. నిచ్చెన మెట్లెక్కి వచ్చినట్టుంది ఆ దారి.

'అబ్బో నిట్టనిలువుగా ఉంది. అడుగు వేస్తుంటే జర్రున జారిపోతున్నది. నిజంగా అదృష్టమే.' అని కళ్లింతవి చేసి చిన్నపిల్లవాడిలా చెప్పాడు పాల్.

'అయ్యో చక్కని కాలిబాట ఉండగా ఈ బాధ ఎందుకు? నేను హాయిగా నలిగిన దార్లోనే వచ్చాను. కొండచుట్టి.' అన్నాడు శంకరం.

వాళ్లకు ఆనందంగా ఉంది. ముగ్గురూ కలుసుకున్నారు. హాయిగా గాలి. వెచ్చగా ఎండ. పరుగులు తీస్తున్న తెల్లటిమేఘాలు ఆకాశాన. శాంతంగా మనసు.

అన్నిటికన్న ముఖ్యం తాము ఆ ఎల్లోరా కొండలమీద ఉన్నందుకు, పూర్వజన్మ స్మృతులతో వాళ్లు ఉవ్విళ్లూరుతున్నారు. ప్రపంచదేశాలు సైతం ఈర్ష్యపడే మహాకళా వారసత్వం స్పృహ వాళ్లను ఉద్వేగపరుస్తున్నది. ఈ మహా శిల్పసంపదలు తమ స్వంతం. అవి తమ పూర్వతరాల కళాతపస్సుల మహోజ్వల వారసత్వకళావైభవం! తరతరాల భారతీయ సాంస్కృతిక వైభవాన్ని ప్రదర్శిస్తున్న కళాక్షేత్రం ఈ ఎల్లోరా గుహలు.

ఒక స్వప్నం ఫలించినట్టు ఉంది వాళ్లకి.

నిజానికి ఇది హఠాత్తుగా పెట్టుకున్న యాత్ర.

శంకరం స్కూల్‌లో టీచర్. పిల్లలను తీసుకుంటూ అజంతా ఎల్లోరాలు వెళ్లాలనుకుంటున్నామని ఓసారి రాజుతో చెప్పాడు. కొన్నాళ్ల తర్వాత 'ఏమిటోనండి కొందరికి ఇష్టం. కొందరికి అయిష్టం. చాలా దూరం ఎల్లోరా అజంతాలు. దగ్గర్లో

నాగార్జున సాగర్ పెట్టుకుందాం అంటున్నారు' అన్నాడు. తర్వాత ఓ రోజున 'ఈ ఇరవై తొమ్మిది సాయంత్రం ఏడు గంటలకు పాతబస్తీలోని మా స్కూల్ దగ్గర అంతా ఉండాలి' అన్నాడు. ఆ ఇరవై తొమ్మిదికి రెండ్రోజుల ముందు 'స్కూల్ మేనేజింగ్ కమిటీ వాళ్లు పిసినిగొట్టులు. ఖర్చులు అన్నీ మీరే పెట్టుకోవాలంటున్నారు.' అని పెదవి విరిచాడు. ఆ ఇరవై ఎనిమిదో తేదీన, వచ్చి ప్రయాణం స్థిరపడింది. మీ పైసలు ఇవ్వండి' అని పైసలు అడిగి తీసుకున్నాడు. రమాపతిరావు, రాధాకృష్ణమూర్తిని కూడా రమ్మన్నాడు. 'ఏం తేదీ నిర్ణయించారండీ. ఫస్టకి రెండ్రోజులు ముందు? ఎక్కడ తెచ్చేదిప్పుడు?' అని విసుక్కుంటూనే ఉంగరాలు తాకట్టు పెట్టి ఆ ఉదయం డబ్బిచ్చి, ఆఫీసులకు సెలవుపెట్టి, చిన్న చిన్న బెడ్డింగ్‌లతో సాయంత్రం ఏడుగంటలకు స్కూల్ దగ్గర వాలేరు. చలికాలం.

శంకరం ఆ స్కూల్‌లో కొత్తగా చేరాడు. ఆ స్కూల్ కూడా చిన్నది. ఆ ఏడాదే పదో తరగతి పిల్లలు తొలిసారిగా పబ్లిక్ పరీక్షలు రాస్తున్నారు. అట్లా హైస్కూల్ అయింది. ఒక్కో తరగతిలో పదిహేను ఇరవైమంది కన్నా ఎక్కువమంది విద్యార్థులు లేరు. తొమ్మిది, పది తరగతుల పిల్లలను మాత్రమే ఈ పర్యటనకు రమ్మంటే ముప్పయిమందికన్నా ఎక్కువమంది పిల్లల రాలేకపోయారు. టీచర్లు, వాళ్లకుటుంబాలు, వాళ్ల స్నేహితులు, మేనేజ్‌మెంట్ సభ్యులూ అంతా కలిస్తే కూడా బస్‌కి సరిపడే సంఖ్య లభించలేదు. అట్లా ఈ స్నేహితులకు అవకాశం చిక్కింది.

ప్రయాణంలో ఆ టూరిస్ట్ బస్‌డ్రైవర్ ఇబ్బందులు పెట్టాడు. ఇరవై గంటల్లో చేరుకోవాల్సిందల్లా —— మైసూర్ బోర్డర్‌లో ఈ సమయంలో టూరిస్ట్ బస్సులను పోనివ్వరనీ, ఈ టౌన్‌లో తప్ప పండుకోవటానికి ఎక్కడా సదుపాయం ఉండదనీ, ఇంజన్ వేడెక్కిపోయిందనీ, మహరాష్ట్ర బోర్డర్ అనీ, కాఫీలు భోజనాలు, మధ్యలో వంటలు ఇట్లాంటి ఇబ్బందులతో —— హైదరాబాద్‌నుండి ఔరంగాబాద్ చేరటానికి ముప్పయి గంటలు చేశాడు.

ఔరంగాబాద్ చేరుకునే సరికి అర్ధరాత్రి ఒంటిగంటయింది.

డ్రైవర్‌కి ముందే బక్షీష్ ఇచ్చి ఉంటే ఈ ఇబ్బందులు ఏవీ ఉండేవి కాదట. టూర్ ఏర్పాటు చేసినవాళ్లకి ఈ రహస్యం ఔరంగాబాద్‌లో వేరే టూరిష్ట్ బస్ వాళ్లు చెప్తే తెలిసింది. అక్కడ నుండి కథ మారిపోయింది.

ఎల్లోరాలో వంట చేసుకోవచ్చని అక్కడే అన్ని సదుపాయాలు ఉన్నాయని డ్రైవరే చెప్పాడు. వేకువజామున అయిదున్నరకు బయల్దేరి ఆరుకల్లా ఆ టూరిస్ట్ హోటల్ దగ్గరకు చేర్చాడు.

'ఉదయం ఫలహారం తిని వెళ్లండి. గుహలు మీరు చూసి వచ్చేసరికి భోజనాల

వంటలు పూర్తవుతాయి' అని స్కూల్ మేనేజింగ్ కమిటీ ఉపాధ్యక్షుడు స్వామి చెప్తున్నా 'ఈ టిఫిన్ల కోసం ఆ చెట్టుకింద కూర్చోవడమా' అని వాళ్లతో చెప్పకుండా వచ్చేశారు ఆ ముగ్గురూ.

'టూరిస్ట్!' ఆనందంతో కేకవేశాడు పాల్.

శ్వేత జాతీయుడు. బహుశా బ్రిటిష్ టూరిస్ట్ కావచ్చు. టూరిస్ట్ హోటల్ దగ్గర ఈ శ్వేతజాతి టూరిస్ట్‌లు చాలామందే కన్పించారు. ఆడా మగా. కెమేరాలతో. బైనాక్యులర్స్‌తో.

ఈ మిత్రులు అక్కడ ఎల్లోరా గుహల్లో శిల్పాలనీ, ఆ అందాలనే కాకుండా దేశదేశాల వినోద పర్యాటకుల కోసం కూడా వెతుకుతున్నారు.

ఎల్లోరా గుహల గురించి వాళ్లేం చెప్తారో వినాలన్న కుతూహలంతో ఉన్నారు. భారతీయ సంస్కృతిని గురించి ఆ టూరిస్ట్‌ల అభిప్రాయం తెలుసుకోవాలని కూడా వాళ్లకు ఉంది.

మనం ఆ పై గుహలు పోయి చూడగలమా అని సందేహం వెలిబుచ్చాడు రాజు. ఈ దూరం రావటానికి గంటన్నర పట్టింది. పైకి పోయి మళ్లీ కిందికి దిగి వెళ్లాలంటే ——

పాల్, శంకరం పైకి పోవాల్సిందే అన్న పట్టుదలతో ఉన్నారు. సముద్రాలు దాటి, దేశాలు దాటి, విదేశాలనించి వచ్చి, ఈ రెండు అపురూపమైన గుహలు ఉన్నాయని తెలుసుకుని వాళ్లు వెళ్లి చూసివస్తుంటే మనం వెనకాడటం సిగ్గుచేటుకదా అన్పించింది.

'పదండి పదండి' అని ముందుకు ఉరికాడు పాల్.

'ఇంకో టూరిస్ట్' శ్వేతజాతీయుడే. రాజు సంతోషపడి పోయాడు.

అయితే అక్కడ కాలిదారి కన్పించలేదు. నిలువున ఎక్కగలిగితే దగ్గర. కాని ప్రమాదకరం. నిట్టనిలువునా పోవాలి. కొండరాళ్లను, ముండ్ల మొక్కలునూ ఆధారంగా పట్టుకుని అడుగు తీసి అడుగు వేసుకుంటూ పైకిపోవాలి. అక్కడ కాలుజారితే కొన్ని వందల అడుగుల కిందిలోయలో, ఎల్లోరా వాగులో పడాల్సిందే.

చుట్టూ తిరిగిపోతే అంత ప్రమాదం ఉండదు. కాని కనీసం ఓ అర్ధగంట సమయమన్నా పట్టుంది.

అదే సమయంలో, అంతవరకు ఎక్కడ ఏ గుహలో నిద్రపోయిందో ఏమో అప్పుడే నిద్రలేచి ఒళ్లు విదిలించుకుని పరుగుతీస్తూ అడవిపంది ఒకటి చెట్లలో మాయమయింది.

ముగ్గురూ కాలిబాటనే ఎంచుకున్నారు. చుట్టుదారి అయినా అదే భద్రం.

ఎల్లోరా గుహలు చూట్టానికి వచ్చి ఇక్కడ ప్రాణం కోల్పోవటం మూర్ఖత్వం!

టూరిస్ట్‌లను ఎట్లాగన్నా కలుసుకోవాలి. వాళ్లతో మాట్లాడాలి.

ఆ టూరిస్ట్‌లు వీపు మీద బేగ్‌లున్నాయి. అట్లాంటి బేగ్‌లు ఉంటే చేతులు రెండూ —— జారిపోతున్నప్పుడో, పట్టు దొరకనప్పుడో సదుపాయంగా ఉంటాయి. చేతుల్లోని చెప్పుల్ని ఎయిర్‌బేగ్‌లో ఇరికించారు, ఇప్పుడు. సూదుల్లా మొనలు పొడుచుకు వచ్చిన రాళ్లు పాదాలకు ముళ్లల్లా గుచ్చుకుంటున్నాయి. ఇట్లాంటి రాళ్లల్లో చెప్పుల్లేకుండా నడవటం అలవాటు లేదు. అయితే పాదాలకు పట్టుదొరికి భద్రంగా ఉంది.

శంకరం దాదాపు ఓ వందగజాల దూరంలో ముందున్నాడు. శంకరంని కలవాలి. భుజాన ఈ బేగ్ బరువు బండరాళ్ల మోతలా ఉంది రాజుకి.

పైనుండి టూరిస్ట్‌లు పిలుస్తున్నారు. కమాన్ కమాన్ అని

అంతలో కొండమీదినించి ఏదో బండరాయి కిందికి జారిపడిపోతున్న భయంకరమైన శబ్దం. కొండ మూలిగినట్లయింది. లోయల్లో భయం ప్రతిధ్వనించింది. చెట్లన్నీ వణికినట్టనిపించింది. ఉరుములాంటి చప్పుడు విని గుండెజార్చుకున్నాడు రాజు. ఎక్కడ ఎవ్వరికి ఏమయిందో. టూరిస్ట్‌కా, పాల్‌కా, శంకరానికా?

పెద్దగా అరచి పిలిచాడు రాజు.

కొండలు పలికాయే తప్పించి ఎవ్వరి జవాబూ విన్పించలేదు.

మరోసారి... మరోసారి పిలిచాడు రాజు.

ఎవ్వరూ పలకలేదు.

క్రూరమృగం నోరు తెరచినట్టుగా క్రింద లోయ కన్పించింది. కళ్లు తిరిగాయి. కాళ్లు వణికాయి. పాదాలు పట్టుతప్పిపోతున్నాయి.

తను దారితప్పాడా?

అక్కడే నేలమీద కూర్చున్నాడు. గుండెనిండా గాలిపీల్చుకుని కళ్లుమూసుకొని అలసట తీర్చుకుని నిట్టూర్చాడు. తన తండ్రీ, తల్లీ, పెళ్లీడు చెల్లెలు, ఇంకా డిగ్రీ చదువుల్లో ఉన్న తమ్ముళ్లూ రాజు కళ్ల ముందు కదిలారు.

* * *

కొండకు అతికిన అంచులాంటి కాలిబాటలో ఆగిపోయాడు శంకరం. ఉరుము ఉరిమినట్టు కొండమీంచి జారిపడిన బండరాయి తన గుండెలో పడినట్టయింది.

రాజు, పాల్ ఏమయ్యారు? ఎక్కడ? వాళ్లకేమన్నా అయిందా? భయపడి

పోయాడు. 'భగవంతుడా, అట్లా జరగకూడదు' అని ప్రార్థించాడు.

అంతలోనే పైకి వస్తూ రాజు కనబడ్డాడు. మరో దిక్కునుండి పాల్ తన భుజానికి వేలాడుతున్న ఎయిర్‌బేగ్‌ని మోసుకుంటూ వచ్చాడు. అతడి ముఖంలో చిరునవ్వు.

'ఏమిటి అట్లా నవ్వుతున్నారు?' భయమంతా ఎక్కడికిపోయిందో?

'మా ఆవిడ గుర్తొచ్చింది' అని మరోసారి నవ్వాడు పాల్.

తన మెడలోని ముత్యాలహారాన్ని తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు.

'నన్ను చూస్తే ఆమెకు చాప్లిన్ గుర్తొస్తాడట.'

'మీ ఆవిడ అభిప్రాయాలకు జేజేలు' అని ఇద్దరూ నవ్వారు.

అంతలో టూరిస్ట్‌లు ఇద్దరూ సమీపించారు. వాళ్లను చూస్తే చిన్నవాళ్లలా అన్పించారు. పాతికేళ్లలోపు వాళ్లే.

రెండు చేతులూ జోడించి అసంకల్పితంగానే శుభాకాంక్షలు చెప్తున్నట్టు నమస్కారం చేశారు. వాళ్లు కూడా చేతులు జోడించి నమస్కరించారు. నవ్వు వాళ్ల ముఖాల మీద మెరిసింది.

వాళ్లు ఇంగ్లీషు వాళ్లని వాళ్ల మాటల్లో అర్థమయింది.

'పై గుహలు ఎట్లా ఉన్నాయి?' అడిగాడు పాల్.

'తప్పక చూడండి. మళ్లీ మళ్లీ చూడాలనిపించేంతటి అద్భుతమైన గుహలు'

ఆ ఇద్దరిలో పొడవుగా ఉన్న ఓ యువకుడు కెమేరా సిద్ధం చేశాడు. ఆ ముగ్గురు మిత్రుల ఫోటోలు తీయాలని. రాజు, శంకరం, పాల్ సంబరపడిపోయారు.

వాళ్లు ఇక్కడ ఈ ఔరంగాబాద్‌లో పదిహేను దినాలుగా ఉంటున్నారట. అంతకు ముందు పదిరోజులు అజంతా గుహల్లో తిరిగారట. ఆ పొడవు యువకుడు హెర్బెర్ట్. రెండో ఆయన గెడ్డం పెంచాడు. అతడి పేరు జోసెఫ్. గ్రంథ రచయిత హెర్బెట్. ఫోటోగ్రాఫర్ జోసెఫ్.

'ఈ గుహల గురించి మీ అభిప్రాయం?' చిన్న పిల్లవాడి కుతూహలంతో అడిగాడు శంకరం.

'ప్రపంచంలోని సప్తాద్భుతాలు (Seven Wonders of the World) లో ఖచ్చితంగా కైలాస్ టెంపుల్‌ని చేర్చాలి. మాకు తాజ్‌మహల్ కన్నా కైలాస్‌టెంపుల్ మహాద్భుతం అన్పించింది. ఈ ఎల్లోరాగుహలు ఒక్కటి చాలు పర్యాటక పరిశ్రమతో ఈ దేశం కనకవర్షం కురిపించుకోవటానికి!'

ఉప్పొంగిపోయారా ముగ్గురు మిత్రులు...

శంకరం పాల్ దగ్గరున్న ఎయిర్‌బేగ్‌ని అందుకుని జిప్ తీసి లోపలఉన్న ఇంగ్లీషు పోయిట్రీ బౌండ్‌ను తీసి, ఆ పుస్తకం మొదటి టైటిల్ పేజి తెరచిపెట్టి ఆ

ఇద్దరు టూరిస్ట్‌ల ఆటోగ్రాఫ్‌లు తీసుకున్నాడు. వాళ్లు శంకరం అడ్రస్ అడిగి తీసుకున్నారు. శంకరం కథారచయిత అనీ, రాజు చిత్రకారుడు అనీ, పాల్ గాయకుడు అనీ తెలిసి మెచ్చుకోసాగారు. వాళ్ల ముఖాలు ఆనందంతో విచ్చుకున్నాయి. వాళ్లకు బేగ్‌లో ఉన్న ఆపిల్‌పళ్లు తీసి ఇచ్చాడు శంకరం. బత్తాయిలు తీసి ఇచ్చాడు. వాళ్లతోపాటే ఈ ముగ్గురు మిత్రులు పళ్లు తిన్నారు.

టూరిస్ట్‌లు తమ దారిలో వెళ్లిపోయిన తర్వాత, ఈ ముగ్గురు మిత్రులు ధైర్యం చిక్కించుకుని పై గుహలకోసం దారిపట్టారు. ఈ బరువు కొంతన్న తగ్గించుకోకపోతే నడవలేం అని శంకరం, రాజు ఎంతో ప్రేమతో తెచ్చుకున్న పగడం రాయిని మాత్రం ఉంచి మిగిలిన రాళ్లన్నిటినీ కిందికి పారేశాడు. 'ఈ రాళ్లను ఎల్లోరా వాగులో ఏరుకోవచ్చులే' అని వాళ్లని ఓదార్చాడు.

ఎల్లోరా స్మృతినిక్షేపాలుగా దాచుకోవాలనుకున్న ఆ రాళ్లు ఎల్లోరా శిల్పకాంతల జీవితసౌందర్యాలగుర్తుల్లాగ, వారి కన్నీళ్లతో మొలిచిన పుష్పాల్లాగ ఉన్నాయి. ప్రకృతి నగ్న సౌందర్య విలాసంతో తేజరిల్లుతున్న ఆ రాళ్లను పాల్ పారేయటం వాళ్లకి దిగులు కలిగించింది. అయితే అవి మళ్లీ ఏరుకోవచ్చులే అని తమని తాము ఓదార్చుకున్నారు. ఆ బరువు తగ్గినందుకు మనసుకూడా తేలిక పడింది.

చివరకు అవి రాళ్లులా కన్పించాయి పాల్‌కి! గుడ్డితనం అంటే ఇదే కదా!

ఆ శిల్పాల కన్నా, ఆ గుహలకన్నా, తల్లీ తండ్రీ చెల్లెలూ తమ్ముడూ భార్యా స్నేహితురాలూ —— వాళ్ల నవ్వులూ, కన్నీళ్లూ, ఈ జీవితంలోని అనేకమైన అందాలూ, ఆనందాలూ, ఓదార్పులూ, అనుభూతులూ గొప్పవి. కళలకు ప్రాణం జీవితం. అన్ని కళల కన్నా గొప్పకళ జీవితం. కళ దాని ఒక ఛాయమాత్రమే. జీవితం బరువు తూగింది త్రాసులో.

టూరిస్ట్‌ల ప్రోత్సాహంతో కొంచెం ముందుకు పోయేసరికి మంచి కాలిబాటే దొరికింది. పై గుహలు ముందుకు వచ్చేసరికి వాళ్లు పెద్ద గొంతుతో ముగ్గురూ చప్పట్లు కొట్టి సంతోషంగా కేకలేశారు! గంతులేశారు.

* * *

వాళ్లు ఒక్కొక్క గుహనే చూసుకుంటూ, కదల్లేక కదల్లేక చేరుకునేసరికి కైలాస్ టెంపుల్ ప్రత్యక్షమైంది! ఉదయం నుండీ, వాళ్లకు సాయంత్రానికల్లా ఇక్కడ నుండి తిరిగి వెళ్లిపోవాలి కదా అన్న బెంగ పట్టుకున్నది. ఆ బస్సులో తిరిగి వెళ్లకుండా ఇక్కడే ఉండిపోతే ఏమౌతుంది... ఓ వారం పదిరోజుల పాటు కనీసం అక్కడే ఉండిపోవాలని అనిపిస్తున్నది. శంకరంకి సంక్రాంతి సెలవులు. కాని మిగిలిన ఇద్దరికీ సెలవులేదు.

మరోసారి ఎప్పుడో —— భార్యను తీసుకుని రావాలని పాల్‌కి. శంకరంకి పెళ్లిచేసుకున్నాకా భార్యతో రావాలని. మనస్సులో స్వప్నాలు.

అన్ని గుహలూ ఒక ఎత్తు. కైలాస్ టెంపుల్ ఒక ఎత్తు అన్పించింది.

ఇంతవరకు వాళ్లు కళాజగత్తులో విహరించారు. ఇప్పుడు వాళ్లు స్వప్నసీమల్లో మునిగి తేలుతున్నట్టు... ఒక పారవశ్య అనుభూతి... ఒక దిగ్భ్రాంతి...

అక్కడ కనిపిస్తున్న సందర్శకులు... వివిధ దేశాల వాళ్లు... దేశీయులు... తెలుగు వాళ్లు... కెమేరాల వాళ్లు...

ఆ కైలాస్ టెంపుల్‌లో ——

భారతీయ పురాతన సాంస్కృతిక వారసత్వ నిధులను భద్రపరచే ప్రభుత్వ సంస్థ రాతల ప్రకారం ఈ ఎల్లోరా గుహలు — బౌద్ధ, జైన, హిందూమత ప్రాచుర్యంలో ఉన్న వివిధ చారిత్రక ఘట్టాలలో దాదాపు ఎనిమిది వందల ఏళ్లు కళాకారుల తపస్సుతో నిర్మాణమయ్యాయి. బౌద్ధబిక్షువులు తమ ఆరాధనా సాధనలో ఈ గుహలు శతాబ్దాలుపాటు నిర్మించి బౌద్ధజ్ఞానాన్ని ప్రచారం చేశారు. విహారాలు, స్థూపాలు, చైత్యాలు, స్తూప చైత్యాలు నిర్మించి మహాయాన ప్రభావంగా బౌద్ధ జాతక కథలను శిల్పాలుగా, కుడ్య శిల్పాలుగా, గాథాలహరిగా బౌద్ధధర్మ ప్రచారం కోసం తమ జీవితాలను వారు అంకితం చేసుకున్నారు. కండ్ల ముందు బుద్ధభగవానుడే కన్పిస్తున్నట్టు ఉంది. జైన గుహలు, శైవ గుహామందిరాలు తర్వాతకాలంలో అవతరించాయి.

ఈ కైలాస టెంపుల్ మాత్రం గుహకాదు. బృహత్ మందిరం. దీన్ని 16వ గుహ అని అంటున్నారు. కొండపై భాగం నుండి క్రిందికి తవ్వుకుంటూ వచ్చి ఏకశిలామహామందిరాన్ని ఆలయవాస్తు సంప్రదాయాలతో, అపురూపమైన అలంకృత శిల్పాలతో తీర్చిదిద్దారు ఆనాటి మహా శిల్పులయిన భక్తులు.

కైలాసమందిరం రెండో అంతస్తులో ఆ ముగ్గురు స్నేహితులు ముఖాముఖిగా కూర్చున్నారు.

అక్కడకు వచ్చేసరికి ముగ్గురు మౌన ముద్రాంకితులైనారు. పాల్ గొంతు మూగవోయింది. రాజు పెన్సిల్ నిద్రపోయింది. శంకరం దృష్టి అంతర్ముఖమైంది.

అంతకుముందు రాజు స్కెచ్‌బుక్‌ని జాపనీస్ యాత్రికుల గుంపులో ఓ ఇరవైయ్యేళ్ల అమ్మాయి అడిగి తీసుకుంది. ఆమె తన స్కెచ్‌బుక్‌ను అడగటమే ఒక మహాభాగ్యం అన్నట్టు యిచ్చేశాడు రాజు. మళ్లీ మరోసారి వచ్చి ఇక్కడే ఉండి కేన్వాస్‌లు నింపుకోవచ్చులే అనుకున్నాడు. ఆ అమ్మాయి బదులుగా ఒక కవరు అతడి చేతిలో పెట్టింది. దాన్లో చాలా పైసలు ఉన్నట్టు ఉన్నాయి. ఎంత ఉన్నది ఇంతవరకూ

అతడు చూసుకోలేదు. పాల్, శంకరంలు ఆ సమయంలో వేరే గుహల్లో ఉంటంవల్ల తన స్కెచ్‌బుక్ కథకూడా వాళ్లకు తెలీదు. ఆ స్కెచ్‌బుక్‌మీద అతడి సంతకం చేయించుకుంది. చిర్నామా రాయించుకుంది. అతడి ఫోటోలు తీసింది. అతడితో పాటు ప్రక్కనే నుంచుని ఆ బృందం అంతా ఫోటో తీసుకున్నారు. ఆ ఫోటోలు పంపిస్తామన్నారు.

ఆ అనుభం ఇప్పుడు నెమరు వేసుకుంటున్నాడు రాజు.

* * *

'ఒక సంగతి తెలుసా? నేను ఆ కాలంలో ఒక నర్తకిని.' అన్నాడు పాల్.

శంకరం, రాజు ఈ ప్రపంచంలోకి వచ్చారు.

'ఎల్లోరా నర్తకిని నేనే! ఈ శిల్పాలన్నిటికి నేనే మోడల్‌ని!'

శంకరం కూడా తనను తాను వెతుక్కున్నాడు...

'నేను కేవలం బౌద్ధ భిక్షువుని మాత్రమే!'

ఆ ఇద్దరూ రాజును చూశారు...

'నేనా, శిల్పిని, గురు శుశ్రూష చేసి, గురు ప్రేమను పొందిన శిల్పిని!'

* * *

– 'ఆంధ్రప్రభ' వార పత్రిక *2.7.1969*